ప్రజాశక్తి

గురువారం 13 నవంబర్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

వెజి(ట్ర)బుల్

- కొండెక్కిన కూరగాయల ధరలు
- తుపానుకు దెబ్బతిన్న పంటలు
- కార్తీకమాసంలో పెరిగిన వినియోగం
- బెంబేలెత్తుతున్న ప్రజలు

ప్రజాశక్తి-మైలవరం

కూరగాయల ధరలు కొండెక్కాయి. ప్రస్తుతం మార్కెట్‌లో వాటి ధరలు పైపైకి వెళు తున్నాయి. ఏ కూరగాయ కొనాలన్నా ధర అందుబాటులో లేకపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలతో జిల్లాలో రైతులు కాయగూరలు పండించలేని పరిస్థితి తలెత్తింది. దీనికి తోడు మొంథా తుపాన్ కూరగాయల పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. స్థానికంగా కూరగాయల ఉత్పత్తి లేకపోవడంతో వాటి ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. తుపాను కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసే రైతుల్ని నిండా ముంచింది. ఏటా ఈ సీజన్‌లో కూరగాయలు పుష్కలంగా పండుతాయి. అన్ని కూరగాయల ధరలు మోస్తారులోనే ఉంటాయి. తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిని ధరలు కొండెక్కాయి. గత నెల వరకూ ఏ కూరగాయ ధర అయినా కిలో రూ.30 నుంచి రూ.40 వరకు ఉండేది. ప్రస్తుతం అన్ని రకాల కాయగూరల ధరలు కిలో రూ.60 నుంచి రూ.80 వరకు పలుకుతున్నాయి. దీంతో కూరల స్థానంలో పచ్చళ్లతో సరిపెట్టుకోవాల్సి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు.

ఒకప్పుడు మైలవరం పరిసర ప్రాంతాల్లో రైతులు కూరగాయ పంటల సాగు చేపట్టేవారు. నియోజకవర్గంలో ఈ ఏడాది కూరగాయల సాగు పూర్తిగా తగ్గిపోయింది. గిట్టుబాటు గాని ధరలతో రైతులే సాగుకు వెనుకంజ వేస్తున్నారు. దీనికి తోడు తుపాన్ల ప్రభావంతో వేసిన పంటలు పూర్తిగా పాడవ్వడంతో పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులంటున్నారు. మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం, (మిగతా 2లో)

భారీగా గంజాయి పట్టివేత

- 249 కిలోలు స్వాధీనం
- నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-కంకిపాడు

కానూరు వద్ద భారీ మొత్తంలో గంజాయిని డిఆర్ఐ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎపి ఈగల్ బృందంతో కలిసి నిర్వహించిన ఈ దాడిలో 249 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులు గంజాయిని యూపీకి తరలించేందుకు సిద్ధమవుతుండగా అధికారులు దాడి చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు విజయవాడకు చెందిన రాహుల్‌కుమార్, హుస్సేన్, హర్యానాకు చెందిన గురుదయాల్, వైజాగ్‌కు చెందిన ఆనంద్‌కుమార్‌లను అరెస్టు చేశారు. మరొక నిందితుడు పరారీలో ఉన్నాడు. గంజాయిని ఒడిశా నుంచి విజయవాడకు తీసుకొచ్చిన నిందితులు కానూరు వద్ద నిల్వ ఉంచారు. పక్కా సమాచారంతో దాడి చేసిన అధికారులు అక్కడున్న గంజాయిని యూపీకి చెందిన వాహనంలో ఎక్కిస్తుండగా పట్టుకున్నారు. గంజాయి తరలించడానికి సిద్ధం చేసిన ఐదు లారీలను, ఒక కారును అధికారులు స్వాధీనం చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.50 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

ట్రైనీ ఐఎఎస్‌లకు కొండపల్లి ఖిల్లా గురించి వివరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

అభివృద్ధిలో పర్యాటకమే కీలకం

ట్రైనీ ఐఎఎస్‌లతో కలెక్టర్ డా.లక్ష్మీశ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి సమ్మిళిత, సుస్థిర ఆర్థిక వృద్ధి ముఖ్యమని, ఈ ప్రగతికి పర్యాటక రంగ అభివృద్ధి చోదకశక్తి అని, జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలతో కృషి చేస్తున్నామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ పొందుతున్న 20 మంది ట్రైనీ ఐఎఎస్ అధికారులు బుధవారం కొండపల్లి ఖిల్లాకు ట్రెక్కింగ్ చేశారు. ఈ సందర్భంగా ఖిల్లా చారిత్రక వైభవాన్ని కలెక్టర్ వివరించారు. స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేస్తే చారిత్రక నేపథ్యం గురించి (మిగతా 2లో)

విద్యుత్ భారాలపై మరో పోరాటం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ: విద్యుత్ భారాలపై ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి తాజాగా రూ.12,771 కోట్ల భారం ప్రజలపై వేయకుండా ఆపాలని, గతంలో వేసిన భారాలను రద్దు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. విజయవాడ గవర్నర్‌పేటలోని పలు ప్రాంతాల్లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్, నేతలతో కలిసి బాబూరావు బుధవారం పర్యటించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకున్నారు. వినియోగదారుల బిల్లులను పరిశీలించారు. సర్దుబాటు ఛార్జీల భారాన్ని ప్రజలకు తెలియజేప్పారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ విద్యుత్ భారాలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను దగా చేసిందని అన్నారు. 17 నెలల కాలంలో 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి రూ.15,485 కోట్లు ట్రూఅప్ ఛార్జీలను ప్రజల నెత్తిన మోపిందన్నారు. దీనికి తోడు అదనంగా ప్రతి నెలా యూనిట్‌కు 40 పైసలు చొప్పున సంవత్సర కాలంలో రూ. 2758 కోట్ల సర్దుబాటు ఛార్జీలు వసూలు చేశారన్నారు. మొత్తం రూ.18,243 కోట్ల అదనపు భారం మోపి దీనిలో రూ.923 కోట్లు అంటే యూనిట్‌కు 13 పైసలు మాత్రమే తగ్గించి విద్యుత్ ఛార్జీలు తగ్గుతున్నట్టు ప్రచారం చేయడం శోచనీయమన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో వేసిన భారాలు కొనసాగుతున్నాయని, దీనికి కూటమి భారాలు తోడయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతటితో ఆగకుండా 2019, 2024 సంవత్సరాల కాలంలో వినియోగించుకున్న విద్యుత్‌పై ఇప్పటికే సంవత్సరానికి ఒకసారి, నెలకు ఒకసారి పలు రకాలుగా సర్దుబాటు ఛార్జీలు మోపిన పాలకులు మళ్లీ 4వ కంట్రోల్ పీరియడ్ పేరుతో అదనంగా మళ్లీ రూ.12,771 కోట్ల (మిగతా 2లో)

విద్యుత్ బిల్లులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు బాబూరావు, కాశీనాథ్

ముగ్గురు బాలికలు అదృశ్యం

కాకినాడలో ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-పెడన: కృష్ణాజిల్లా పెడనలో ముగ్గురు బాలికలు అదృశ్యమవ్వడం కలకలం రేపింది. పెడన మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ఉర్దూ మదర్సా నుంచి మంగళవారం రాత్రి బాలికలు అదృశ్యం అయ్యారు. దీనిపై ఎస్ఐ జి.సత్యనారాయణ విచారణ చేపట్టగా బంటుమిల్లికి చెందిన మహమ్మద్ ఆస్మా, విజయవాడకు చెందిన షేక్ సబీహ, కాకినాడకు చెందిన షేక్ సమయ కాకినాడ వైపు వెళ్లినట్లుగా సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించారు. ముగ్గురు బాలికలు కాకినాడకు చేరుకున్నట్లు తెలిపారు.

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

వైద్య విద్య ప్రైవేటీకరణపై వైసిపి నిరసనలు

... వార్తలు లోపలి పేజీల్లో

సామూహిక గృహ ప్రవేశాలు

వార్తలు లోపలి పేజీల్లో

పోరాటాలకు సిద్ధం కావాలి

8లో

మొదటిపేజీ తరువాయి

వెజిట్రబుల్

ఇబ్రహీంపట్నం మండలాల్లో ప్రతి ఏటా బెండ, మునగ, దొండ, వంగ, బీర, దోస, సొర, క్యాలీఫ్లవర్, కాకర తదితర పంటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తుంటారు. అయితే పంట చేతికొచ్చే సమయానికే ఏదో ఒక రూపంలో ప్రకృతి ప్రకోపానికి గురికావాల్సి రావటంతో రైతులు వెనుకంజ వేస్తున్నారు. దీంతో అన్ని మండలాల్లో సాగు పూర్తిగా తగ్గిపోయింది.

భారీగా పెరిగిన ధరలు

క్షేత్రస్థాయిలో రైతు నుంచి ఉత్పత్తి తగ్గిపోవడంతో కూరగాయలకు రోజురోజుకు డిమాండ్ పెరుగుతుంది. కేవలం పది రోజుల్లోనే కూరగాయ ధరలు రెట్టింపు అయ్యాయి. అంతేకాకుండా కార్తీకమాసం కావడంతో కూరగాయల వినియోగం పెరగడం, డిమాండ్ తగ్గట్టుగా సరఫరా లేకపోవడంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. మైలవరం రైతు బజార్‌లో టమాట రూ.32 వంగ 64, బెండ 53, పచ్చిమిర్చి 36, కాకర 50, దొండ 58, సొరకాయ 30, మునగ కాయ 10, దోస 30, హైబ్రిడ్ బీర 55, పొట్లకాయ 30 ఉంటే ప్రైవేట్ మార్కెట్లో 10 నుంచి 20 రూపాయలు అదనంగా ధరలు పలుకుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారస్తులు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయించి అమ్మడంతో కూరగాయలు కొనలేని పరిస్థితి ఉందని పుల్లూరుకు చెందిన నరసమ్మ పేర్కొంది. ఒకప్పుడు వంద రూపాయలు తీసుకెళ్తే సంచి నిండా కూరగాయలు వచ్చేవని నేడు రెండు రకాలు కూడా రావడంలేదని వినియోగదారులు వాపోతున్నారు. ఇటీవల వచ్చిన తుపాన్ దాటికి విజయవాడ తదితర ప్రాంతాలలో కూరగాయల పంటల సాగు పూర్తిగా దెబ్బతినడంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్తులు అంటున్నారు. విజయవాడ తదితర ప్రాంతాల నుంచి కూరగాయలు మైలవరం వస్తున్నట్లు వ్యాపారస్తులు తెలుపుతున్నారు.

ధరలు మండుతున్నాయి

వజ్రాల ధనలక్ష్మి, గృహిణి, మంగాపురం

మార్కెట్లో కూరగాయలు కొందామంటే అధిక ధరలు పలుకుతున్నాయి. దీంతో కొనలేని పరిస్థితి నెలకొంది. ఆకుకూరల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఒక పూట వండితే రెండో పూట పచ్చడితోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది.

30 రూపాయలకు పైగానే

పామర్తి నాగేశ్వరరావు, పుల్లూరు, వంట మేస్త్రి

రైతుబజార్లో ఏ కూరగాయలు కొనాలన్నా 30 రూపాయలకు పైగానే ధరలు ఉండటంతో కొనలేని పరిస్థితి నెలకొంది. పంటలు దెబ్బ తినడంతో కూరగాయల సాగు కూడా బాగా తగ్గింది. దీంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కార్తీకమాసం కావడంతో కూరగాయ ధరలకు రెక్కలు వచ్చాయి.

దుర్గగుడి హుండీల ఆదాయం రూ.2.67 కోట్లు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో యాత్రికులు సమర్పించిన కానుకల లెక్కింపు కార్యక్రమం బుధవారం జరిగింది.

దేవస్థానంలో 15 రోజులకు యాత్రికులు సమర్పించిన కానుకలను ఈవో శీనా నాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ పర్యవేక్షణలో లెక్కింపు ప్రక్రియ జరిగింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో 49 హుండీలలోని 120 సంచులను తెరిచి లెక్కించారు.హుండీ లెక్కింపు లభించిన కానుకలలో నగదు రూ. 2,67,93,738, 215 గ్రాములు బంగారం, వెండి 3 కిలోల 320 గ్రాములతో పాటు పలు దేశాల కరెన్సీ వచ్చినట్లు వెల్లడించారు. ఈ లెక్కింపు ప్రక్రియను ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు సుకాసి సరిత, టి.రమాదేవి, పద్మావతి ఠాకూర్, కళావతి, రాఘవరాజు, హరికృష్ణ పర్యవేక్షించారు.

ఉచితంగా సివిల్స్ కోచింగ్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు యూపీఎస్సీ సివిల్స్ ఉచిత శిక్షణ ఇస్తున్నామని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. రాష్ట్రంలోని 340 మంది నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ ఎగ్జామ్‌కి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 13 నుంచి 16 వ తేదీ వరకు ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరించబడతాయని తెలిపారు. అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని, మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని, మరిన్ని వివరాలకు https://apstudycircle.apcfss.in వెబ్‌సైట్‌ని సంప్రదించాలని మంత్రి తెలిపారు.

శిథిలావస్థలో పశు వైద్యశాలలు

ప్రజాశక్తి-వీరులపాడు: వీరులపాడు మండలంలో పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. మండలంలో వివిధ గ్రామాల్లో పశువైద్య కేంద్రాలకు పక్కా భవనాలు లేవు. 22 గ్రామ పంచాయతీలకు ముగ్గురు పశువైద్య అధికారులు మాత్రమే ఉన్నారు. విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లు ఐదుగురు ఉన్నారు. 14 గ్రామాలకు ఒకరే పశు వైద్య అధికారి ఉండటం వల్ల పూర్తి స్థాయిలో రైతులకు సేవలందించలేకపోతున్నారు. సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడం వల్ల రైతులు పలు ఇబ్బందులు గురవుతున్నారు. వీరులపాడు కేంద్రంగా ఒక పశు వైద్యాధికారి పనిచేస్తున్నారు. జయంతి, దొడ్డదేవరపాడు, వి.అన్నవరం, పల్లంపల్లి, కొనతాలపల్లి గ్రామాలకు వీరులపాడు నుండి వైద్యాధికారి సేవలందిస్తున్నారు. జుజ్జూరు గ్రామంలో పశు వైద్య కేంద్రం శిథిల వ్యవస్థకు చేరింది. గతంలో దాతల సహకారంతో 1985లో రాజా సాహెబ్ కుమారుడు బడే సాహెబ్ పశువైద్య కేంద్రాన్ని నిర్మించారు. ఈ భవనం నేడు శిథిలావస్థకు చేరింది. కొత్త భవనాలు నిర్మించాలని, వైద్య సిబ్బంది కొరతను తీర్చాలని రైతులు కోరుతున్నారు.

నేత్రదానం

ప్రజాశక్తి-గంపలగూడెం: కొత్తపల్లి గ్రామానికి చెందిన గువ్వల మాధవరెడ్డి (78) బుధవారం అనారోగ్యంతో మతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తిరువూరు లైన్స్ క్లబ్ ప్రతినిధి గోగిరెడ్డి కృష్ణారెడ్డి అభ్యర్థన మేరకు కుటుంబ సభ్యులు మాధవరెడ్డి నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. విజయవాడ ఎల్వి ప్రసాద్ ఆసుపత్రి వైద్య సిబ్బంది నేత్రాలను సేకరించారు.

ప్రకటన

నా క్లయింటు TATA CAPITAL LIMITED, విశాఖపట్టణం, రిప్రజెంటింగ్ బై మేనేజర్ వారి సంజాయిషీ పొంది ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని అడపా యుగంధరరావు గారి కుమారుడు అడపా బాలరవికిరణ్‌గారు ది 04-07-2025న కానుమోలు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 3113/2025రూగా రిజిష్టర్ కాబడిన దాఖలు దస్తావేజు రీత్యా దాఖలు పొందిన షెడ్యూలు ఆస్తిని సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో నిర్వివాదముగా అనుభవించుచున్నారు.

ఇట్టి స్థితిలో ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని అడపా యుగంధరరావు గారి కుమారుడు అడపా బాల రవికిరణ్‌గారు హామీగా ఉంచి ఋణ సౌకర్యం పొందుట కొరకు TATA CAPITAL LIMITED, విశాఖపట్టణం వారికి అభ్యర్థన చేసియున్నారు.

కావున ఎవరికైనను ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై గాని, ఎవరికైనను, చట్టరీత్యా చెల్లదగు క్లయిములు గాని, మరి ఏ విధమయిన అభ్యంతరములు గాని ఉన్నయెడల, వారు ఈ ప్రకటన తేది నుండి 07 రోజులలోపుగా లిఖిత పూర్వక ఆధారములతో తెలియ పరచగలరు. సదరు గడువు తేదీలోగా చట్ట ప్రకారము చెల్లదగు ఎటువంటి అభ్యంతరములు గాని రాని యెడల, షెడ్యూలు ఆస్తిని నిర్వివాద ఆస్తిగా ఎంచి, నా క్లయింటు షెడ్యూలు ఆస్తిని హామీగా స్వీకరించి, ఋణ సదుపాయము కలుగజేయుదురు. ఆదర్శిలా వచ్చు ఎట్టి అభ్యంతరములు, క్లయిములుగానీ, చట్టపరంగా బైండు చేయ జాలవనియు, నా క్లయింటు షెడ్యూలు ఆస్తిపై పొందు హామీ మరియు తనఖా హక్కులను భంగము చేయజాలవనియూ ఇందుమూలముగా తెలియజేయుటమైనది.

షెడ్యూలు : కృష్ణా జిల్లా, కానుమోలు సబురి॥ యిలాకా బాపులపాడు మండలం, శేరీ నరసన్నపాలెం గ్రామపంచాయితీలో చేరిన నరసన్న పాలెం గ్రామ తాలూకు, రీ.స.నెం. 48రు దాఖలా చ.గ. 193లు లేక చ.మీ. 161.13రు నివేశ స్థలమున్నూ సదరు స్థలంలో అసెస్మెంటు నెం. 277 రు, డోరు నెం. 1-75/1రు గల గ్రౌండ్ & ఫస్ట్ ఆర్.సి.సి. దాబా ఇంటికి హద్దులు:

తూర్పు : మత్తి రమేష్‌బాబు, మత్తి శీతారాంబాబుగార్ల స్థలం

దక్షిణం : మత్తి వెంకటేశ్వరరావు గారి స్థలం

పడమర : పంచాయితీ బజారు

ఉత్తరం : మత్తి సాంబశివరావుగారి స్థలం

V(G) VIJAYA, Advocates
Flat No. 104, Ground Floor, Shree Ganesh Enclave, Dondaparthi, Near Yerukamamba Temple, VSP-530016 Cell : 9848282374, 8106523333, 9848286374

CHANGE OF NAME

I, **KOTAMSETTI DURGA** (Old Name) R/o. 57-3-38B, Yadavula Bazaer, Siva Colonies, Patamata, Vijayawada-520010. NRT District, Andhra Pradesh. Hence I have changed my name to **KOTAMSETTI PRABHU PRASANNA RAJU** W/o. K.SATTI BABU, Here after my name is known as **KOTAMSETTI PRABHU PRASANNA RAJU** (New Name) W/o. K.SATTI BABU.

దస్తావేజులు పోయినవి

వత్సవాయి మండలం ఇందుగుపల్లి గ్రామానికి చెందిన కాకుమాను రామిరెడ్డి, కాకుమాను రవీంద్రారెడ్డి, కాకుమాను లక్ష్మారెడ్డి పేరు మీద ఉన్న దస్తావేజులు ఇందుగుపల్లి నుంచి వత్సవాయి ఆటోలో వెళ్లుండగా మార్గమధ్యలో పోయినవి. డాక్యుమెంట్ నెంబరు1483/1979, సర్వే నంబర్ 183 లో 18 ఎకరాలు 54 సెంట్లు లో రెండు ఎకరాల 54 సెంట్లు భూమి కలదు. పై ముగ్గురు పేరు మీద గల దస్తావేజులు పోయినవి. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ కు తెచ్చి ఇవ్వగలరు. **ఇట్లు**

కాకుమాను రామిరెడ్డి, కాకుమాను రవీంద్రారెడ్డి, కాకుమాను లక్ష్మారెడ్డి
ఇందుగుపల్లి గ్రామం, వత్సవాయి మండలం ఎన్టీఆర్ జిల్లా. సెల్ నెంబర్9441400239

అభివృద్ధిలో పర్యాటకమే కీలకం

సమాచారం లభించే సాంకేతికత ట్రైనీ ఐఏఎస్‌లకు వినూత్న అనుభవాన్ని అందించింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజంలో మంచి అభివృద్ధికి అవకాశాలున్నాయని, ఈ నేపథ్యంలో పర్యాటకులకు మధురానుభూతులు మిగిల్చేలా పర్యాటక ప్యాకేజీలు అందుబాటులోకి తెస్తున్నామని, ఇప్పటికే టూరిజం గైడ్లుగా యువతకు శిక్షణ కూడా ఇచ్చామని అన్నారు. కొండపల్లి కోటను కూడా పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్ (ఏపీఏఏ) ప్రెసిడెంట్ డా.తరుణ్ కాకాని, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై మరో పోరాటం

ట్రూఅప్ ఛార్జీలు మోపటానికి రంగం సిద్ధం చేశారన్నారు. దీనిపై సిపిఎం, అనేక మంది అభ్యంతరాలు తెలిపినప్పటికీ విద్యుత్ నియంత్రణ మండలి ఈ నెల 18వ తేదీన దీనిపై విచారణ జరపనుందన్నారు. ఈ ప్రతిపాదనలు విరమించడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. భారాలన్నీ కలిపితే కూటమి పాలనలోనే రూ.31,014 కోట్ల భారం మోపారన్నారు. భారాలను మోపటంలో గత వైసిపి ప్రభుత్వంతో కూటమి ప్రభుత్వం పోటీపడుతోందని విమర్శించారు. ఈ భారాలకు వ్యతిరేకంగా ప్రజల ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ నాయకులు కె.దుర్గారావు, ఎం.సీతారాములు, వై.సుబ్బారావు, లక్ష్మణ, రమణ, కొండా తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌పేటలో పర్యటిస్తున్న నేతలు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఒంగోలు
OS No. 721/2022

దేవరకొండ శ్రీనివాసులు ....వాది
Vs
లక్ష్మీసెట్టి కాశీచరణ్ ...ప్రతివాది

నోటీసు

To,
లక్ష్మీసెట్టి కాశీచరణ్, S/o. సాంబశివరావు, హిందూ, వయస్సు 49 సంవత్సరాలు, నివాసం: D.No. 13/259, వార్డు నెం: 13, పాటిమీద గుడివాడ, గుడివాడ మండలం, కృష్ణా జిల్లా.

పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ప్రతివాది అయిన పై తెలిపిన మీకు ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా దేవరకొండ శ్రీనివాసులు అను వాది పై నెంబరు దావాను మీపై పై తెలిపిన దాఖలు చేసినారు. ఈ దావాపై మీకు అభ్యంతరములు ఏమైనా ఉన్నయెడల తేది: 18/12/2025 ఉదయం గం. 10:30 నిమిషములకు పై కోర్టు నందు హాజరై స్వయంగా కాని, లాయర్ ద్వారా కాని తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షములో దావా తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
ఐ. మల్లికార్జునరెడ్డి, ఐ. ఇన్దిర, ఎ. శుభశ్రీ, న్యాయవాదులు, ఒంగోలు.

IN THE COURT OF HON'BLE II ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD
MVOP No. 599 of 2025

Between:
V.Apparao ...Petitioner
AND
K.Veera Venkata Ramana and others ...Respondents

To,
K.Rajkumar S/o, K.Bhaskar Rao, R/o, Laxmipuram Village, Tiruvuru Mandal, NTR (Krishna) District, Andhra Pradesh 521235 ...Respondent No.3

Take notice that the above petitioner had filed the case against you for grant of compensation for the injuries sustained by him in motor accident and the case is posted to **05/12/2025** at **10-30** AM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
M.RAJESH KHANNA
Advocate
Malakpet, Hyderabad.
Counsel for the Petitioner

IN THE COURT OF HON'BLE II ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD
MVOP No. 708 of 2025

Between:
P.Mariyamma and others ...Petitioners
AND
K.Suresh Babu and others ...Respondents

To,
P.Pavan Kumar S/o, P.Veera Swamy, R/o, H.No: 26-20-70/3, Santhi Nagar, 1st Line, Rajupeta, Machilipatnam, Krishna District - 522004 ...Respondent No.3

Take notice that the above petitioners have filed the case against you for grant of compensation for the death of deceased in motor accident and the case is posted to **21/11/2025** at **10-30** AM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
M.RAJESH KHANNA
Advocate
Malakpet, Hyderabad.
Counsel for the Petitioner

పొడి చెత్తకు కిరాణా వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : పొడి చెత్త సేకరణ చేసి తమకు అందించే ప్రజలకు కిరాణా వస్తువులను అందించినట్లు విన్నకోట గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు అన్నారు. ఈ పథకానికి సంబంధించిన స్వచ్ఛ రథం బుధ వారం మండలంలోని విన్నకోట గ్రామంలో పర్యటిం చింది. గ్రామంలోని ప్రజలందరూ తమ ఇళ్లలోని ప్లాస్టిక్, ఓల్డ్ బుక్స్, స్టీల్, కార్డ్ బోర్డు, అల్యూమినియం, ఐరన్, పేపర్ వంటి తమ పొడి చెత్త(డ్రై వేస్ట్) స్వచ్ఛ రథానికి అందజేశారు. ఆ పొడి చెత్తకు బదులుగా పప్పు, ఉప్పు, కారం, సబ్బు వంటి కిరాణా వస్తువులు పొందారు. తమ కు సహకరించి ఊరిని శుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్న గ్రామస్తులను నరసింహారావు అభినందించారు.

పెడన మదరసా నుంచి ముగ్గురు బాలికలు అదృశ్యం

ప్రజాశక్తి-పెడన : పెడన మున్సిపాలిటీ పరిధిలో 15 వార్డు ఉర్దూ మదరసా నుండి మంగళ వారం రాత్రి ముగ్గురు బాలికలు అదృశ్యం అయ్యారు. వీరిలో బంటుమిల్లికి చెందిన ఒకరు, విజయవాడకు చెందిన ఒకరు, కాకినాడకు చెందిన ఒకరు అదృశ్యం అయినట్టు మదరసా సిబ్బంది పెడన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాలికల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పెడన ఎస్సై జి. సత్యనారాయణ దర్యాప్తు చేప ట్టారు. అయితే బాలికలను కాకినాడలో గుర్తించామని, గురువారం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి సహకారం అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీ, అదనపు పోలింగు కేంద్రాల ఏర్పాటుకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. బుధవారం ఆయన కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్ఓ), ఎన్నికల డీటీలతో స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీ, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సమస్యలు తదితర ఎన్నికల సంబంధిత అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి జిల్లాలో స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించి అంశాలు ఏమైనా ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కా రం, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులు చేర్పులు వంటి అంశాలపై తగిన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు, మచిలీపట్నం, గుడివాడ ఆర్డిఓలు కే స్వాతి, జి బాలసుబ్రమణ్యం, ఎన్నికల నమోదు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వివిధ రాజకీయపార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్

రైతుల్ని ఆదుకుంటాం : రామకృష్ణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : బందరు మం డల పరిధిలోని చిన యాదర గ్రామంలో తుపా ను కారణంగా దెబ్బతిన్న వరిచేలను జనసేన పార్టీ మచిలీ పట్నం ఇన్చార్జి డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ బుధవారం పరిశీలించారు. అనం తరం స్థానిక రైతులతో మాట్లాడారు. తుఫాన్ కారణంగా దిగుబడి తగ్గి ధాన్యం నాణ్యత కోల్పోయిందని కొంతవరకు నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. పంట పొలంలో వరికంకులను పరిశీలించి రామకృష్ణ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తుందని, అధికా రులు పర్యవేక్షణలో తుఫాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు గళ్ళ తిమోతి నగర అధ్యక్షులు గడ్డం రాజు, మండల పార్టీ నాయకులు పద్మి,సాయి, మహేష్, ధర్మతేజ రైతులు పాల్గొన్నారు

పంటలు పరిశీలిస్తున్న రామకృష్ణ

ప్రైవేటీకరణ అనడం అవివేకం : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెడికల్ కళాశాలల పిపిపి విధానాన్ని అర్థం చేసుకో లేక వైసీపీ నాయకులు ప్రైవేటీ కరణ అనడం అవివేకమని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మేడికొండ విజయ్ అన్నారు. బుధవారం నియోజ కవర్గ పార్టీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాను గాడిలో పెట్టడానికి కూటమి నాయకత్వంలోని ప్రభుత్వం మెడికల్ కళాశాలల నిర్మాణానికి పిపిపి విధానాన్ని తెచ్చిందన్నారు. ఇందువల్ల ఏ ఒక్క పేదవారికి నష్టం జరగదని, అది కేవలం ప్రతిపక్ష పార్టీల ప్రచారం మాత్రమే నన్నారు. కూటమి ప్రభుత్వం అభివద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక దిగ జారుడు రాజకీయం చేస్తుందని విజయ్ విమర్శించారు.

పోగొట్టుకున్న వస్తువులు అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ మండలం చిన్న ఎరుకపాడు గ్రామానికి చెందిన సూరగాని రూపా రాణి మంగళవారం కొంకే పూడి గ్రామం నుండి తన పుట్టిల్లు చిన్న ఎరుకపాడు గ్రామం వస్తుండగా పెద్దకా లువ సెంటర్‌లో ఆటోలో ప్రయాణిస్తూ తన బ్యాగ్ మర్చిపోయారు. ఆ బ్యాగ్‌లో న బంగారు ఆభరణాలు ఉండడంతో రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుడివాడ రూరల్ సిఐ సోమేశ్వరరావు, ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివా సులు సిసి కెమెరాలు పరిశీలించి ఆటోడ్రైవర్ నుంచి బ్యాగ్‌ను గు ర్తించి సుమారు 55 గ్రాములు (7కాసులు) సుమారు 6,32,500 విలుగల వస్తువులను పోగొట్టుకున్న బాధితులకు అందజేశారు.

బంగారు వస్తువులు అందజేస్తున్న పోలీసులు

నివాళులర్పిస్తున్న దృశ్యం

ఢిల్లీ బాంబు పేలుళ్ల మృతులకు కొవ్వొత్తులతో నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : దేశ రాజధాని ఢిల్లీలో సోమ వారం జరిగిన కారు బాంబు పేలుళ్లలో మరణించిన వారికి కూటమి నాయకులు అవనిగడ్డ రాజీవ్ సెంటర్లో బుధవారం సాయంత్రం కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాంబు పేలుళ్ల మృతులకు సంతాపాన్ని తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి చర్యలకు పాల్పడిన ఉగ్రవాదులను కట్నంక శిక్షించాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు బండే రాఘవ, పర్చూ రీ దుర్గాప్రసాద్, ఘంటసాల రాజమోహన్రావు, మండలి రామ్మోహ న్రావు, కంచర్ల ఆనంద్, దాసినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు సాయం అందజేత

ప్రజాశక్తి-మోపిదేవి : పెదప్రోలు పిఏసిఎస్‌లో సభ్య త్వం కలిగి ఉండి ఇటీవల మృతిచెందిన శివరాంపురం గ్రామానికి చెందిన మేక వెంకటేశ్వరరావు కుటుం బానికి తక్షణ సహాయముగా పదివేల రూపాయల సహాయాన్ని అందించారు. పెద్దప్రోలు పంచాయతీ శివారు శివరామపురం గ్రామానికి చెందిన మేక వెంకటేశ్వరరావు పిఏసిఎస్ లో సభ్యత్వం కలిగి ఉండి డైరెక్టర్ గాను గతంలో వ్యవహరించారు. ఇటీవల ప్రమాదవశాత్తు చెరు వులో పడి మృతిచెందగా మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సహా యాన్ని అధ్యక్షులు నాదెండ్ల శరత్ చంద్రబాబు, సీఈవో వేముల నాగమణిలు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ పోలిమెట్ల ఎసుబాబు పెదప్రోలు తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులు నాదెడ రాజేష్ తదితరులు ఉన్నారు.

సాయం అందిస్తున్న దృశ్యం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ర్యాలీలు

అవనిగడ్డలో...

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం వైయస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వైసీపీ పార్టీ కార్యాలయం నుండి మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని), నియోజకవర్గ ఇంచార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మచిలీపట్నం నార్త్ తహసీల్దార్ నాగభూషణం కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ కార్పొరేటర్లు, సర్పంచ్ లు, నాయకులు, కార్యకర్తలు లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెడన :** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి పార్టీ పిలుపు మేరకు పెడన నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి ఉప్పాల రాము, జడ్పీ చైర్మన్ ఉప్పల హారిక ఆధ్వర్యంలో బుధవారం పెడనలో ర్యాలీ నిర్వహించారు. పెడన నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి తోటమూల తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎలక్షన్ డి టి నరసింహారావు కు వినతిపత్రం అందజేశారు .ఈ కార్యక్రమంలో పెడన నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పామర్రు :** పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే కుమార్ వైఎస్ఆర్సిపి శ్రేణులతో కలిసి స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ గోపాల్ రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా మెడికల్ కాలేజీల్లో పీపీపీ విధానం అనేది లేదని ఈ ప్రభుత్వ నిర్వాకం వల్ల ఉచిత వైద్య సేవలు దూరమై పేదలు, విద్యార్థులు నష్టపోతు న్నారని అన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, వైకాపా జిల్లా ట్రేడింగ్ యూనియన్ అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివా సరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నత్తా రవి, మండల పార్టీ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గన్నవరం లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నిరసనకారులు పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి గన్నవరం తహసీల్దార్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ గన్నవరం తహసీల్దార్ కు వినతిపత్రాన్ని అందచేశారు. గన్నవరం ఎంపిపి అనగాని రవి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో వైద్య విద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉదయం పార్టీ కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్లో గల డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ సెంటర్లోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు. అనంతరం అక్కడనుండి తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి అక్కడ తాసిల్దార్ కే నాగమల్లేశ్వ రరావుకు వినతి పత్రం అందజేశారు. వైసిపి మచిలీపట్నం పార్లమెంటు పరిశీలకులు జెట్టి గురునాథ్, అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, అవనిగడ్డ నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు మధు శివరామకష్ణ, నియోజకవర్గ యువ నాయకులు సింహాద్రి వికాస్, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీపీ తుంగల సుమతీదేవి పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం అన్యాయమని వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌డివో కార్యాలయం వద్ద వైసిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి ఆర్‌డివో బాలసుబ్రహ్మణంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మండలి హనుమంతరావు, ఎంవి నారాయణరెడ్డిలతో కలసి గొర్ల శ్రీను మాట్లాడారు. నందివాడ ఎంపిపి పెయ్యల ఆదాం, నాయకులు పాలేటి చంటి, మట్టా జాన్‌విక్టర్, కందుల నాగరాజు, చుండూరి శేఖర్, కొంకితల ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** పెనమలూరు సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు వైసిపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వమించారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో పెనమ లూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పామర్రులో...

గన్నవరంలో...

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళనలు

విజయవాడ అర్బన్ : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షులు, తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ జరిగింది. పడవలరేవు వంతెన వద్ద నుండి పటమట ఈ సేవ వరకు నిరసన ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎమ్మార్వో కార్యాలయం వద్ద పార్టీ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం దేవినేని అవినాష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వైద్య కళాశాలలను నిర్మించిందని, కూటమి ప్రభుత్వం పిపిపి పేరిట ప్రైవేటీకరణ చేస్తే ఊరుకోమని హెచ్చరించారు.

విజయవాడ సిటీ : విజయవాడ భవానీపురం బ్యాంక్ సెంటర్ వద్ద నుంచి కోళ్లఫారం రోడ్, ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ మీదగా తహశీల్దార్ కార్యాలయం వరకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ పిపిపి పేరుతో 10 మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని విరమించాలన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు ఎండి రుహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అసిఫ్, పాల్గొన్నారు.

మైలవరం : మైలవరంలో భారీ ర్యాలీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఎల్‌హెచ్‌ఆర్ కాంప్లెక్స్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహం నుండి నూజివీడు రోడ్డు మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ మోతియా నాయక్‌కు అందజేశారు. అనంతరం వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు చేయటాన్ని విరమించుకోవాలని లేనిపక్షంలో ఆందోళన ఉదతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమ ర్యాలీ నిర్వహించారు. బుధవారం పట్టణంలోని వైసిపి నియోజకవర్గ కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభమైన ర్యాలీ పాత మున్సిపల్ ఆఫీస్, నెహ్రూ చౌక్, కన్యాకుమారి పాన్ షాప్ సెంటర్, సాయిబాబా ఆలయం, ఆర్.సి.యం చర్చి మీదగా తహశీల్దార్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు టి.జె సుధాకర్ బాబు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరులో అయ్యప్ప స్వామి దేవస్థానం సెంటర్ నుండి మెయిన్ రోడ్డు మీదగా తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాస్ మాట్లాడుతూ విద్యను వ్యాపారం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న చర్యలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు ఎం.సూర్యనారాయణ రెడ్డి, ఎన్.సుధారాణి, తాళ్లూరి నవీన్, యరమల రామచంద్రారెడ్డి, కాలసాని నాగేశ్వరరావు, చలమాల సత్యనారాయణ పాల్గొన్నారు.

నందిగామ : నందిగామ పట్టణ పురవీధుల్లో వైసీపీ నాయకులు బుధవారం పాదయాత్రగా ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్‌రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్.. ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. తొలుత గాంధీ సెంటర్లోని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

తూర్పు నియోజకవర్గంలో ర్యాలీ..

పశ్చిమ నియోజకవర్గంలో ఆందోళన

తిరువూరులో ఆందోళన

ధర్నాను జయప్రదం చేయాలి

విజయవాడ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పరిరక్షణ కోసం ఈ నెల 20 విజయవాడలో జరుగు ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ సిఐటియు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ తూర్పు నగర కమిటీ ఆధ్వర్యంలో బెంజ్ సర్కిల్ కార్మికుల అడ్డా వద్ద బుధవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా సిఐటియు అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును అమలు చేస్తామని ఎన్నికల సమయంలో టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డులో ఉన్న రూ.2 వేల కోట్లను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని తెలిపారు. తూర్పు నగర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి విబి రాజు మాట్లాడుతూ ఈ నెల 20న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు గురుమూర్తి, ఏడుకొండలు, మాజేటి నాగమల్లేశ్వరరావు, దుర్గారావు, నోహిత్ కృష్ణ, రామకృష్ణ, అప్పలనాయుడు, నాగరాజు జి.రాము, పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కంచికచర్ల : రాష్ట్రంలో ప్రజా ఆరోగ్య రంగాన్ని ప్రైవేట్ పరం చేయడం దారుణమని వైసిపి మండల అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం కంచికచర్ల మండల గని అత్కూరు, కొత్తపేట గ్రామాల్లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేస్తే పేదలకు మధ్యతరగతి ప్రజలకు ఎలా వైద్యం అందుతుందో సిఎం చంద్రబాబునాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పేదల జీవితాలతో ఆడుకుంటున్న ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి హరిబండ్ల జగన్నాథరావు, ముప్పాళ్ల నాగేశ్వరరావు, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు ముప్పాళ్ల శివాజీ, ఉపసర్పంచ్ ముప్పాళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ గ్రంథాలయం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు, టిడిపి నాయకులు వీరంకి వీరాస్వామి, యేచూరు రాము పాల్గొన్నారు. అల్లూరు రామచంద్రుడు మాట్లాడుతూ ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు గ్రంథాల వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

క్రీడాకారులకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ కాకాని వెంకటరత్నం కళాశాలలో కాకాని వెంకటరత్నం కళాశాల క్రీడాకారులకు, అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో పాల్గొనే వారికి కాకతీయ హోటల్ రెస్టారెంట్ యజమాని గింజుపల్లి పుల్లారావు బుధవారం క్రీడా దుస్తులను క్రీడాకారులకు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాయప్ప, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరరావులకు క్రీడా దుస్తులను అందజేశారు.

అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : 50వడివిజన్ మహంతిపురం జాడ పాపయ్య వీధిలో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను కార్పొరేటర్ బి సత్యబాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలల క్రితం రూ.13 లక్షల వ్యయంతో జనరల్ బడ్జెట్ ద్వారా మంజూరైన నిధుల కొరత వలన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. చిన్నపాటి వర్షాలకే వన్‌టౌన్ ముంపు ప్రాంతంగా మారుతుందని, దీని ప్రభావం వలన గోల్లపాలం గట్టు, మహంతిపురం ప్రధాన రోడ్లు ముంపునకు గురై ప్రజలు రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ముంపు నివారణ చర్యలను శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. నగరాభివృద్ధికి మంజూరైన రూ.643 కోట్ల నిధులు విడుదల చేయకుండా దారి మళ్లించడం నగర అభివద్ధిని అడ్డుకోవటమే అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్న వైసీపీ కార్పొరేటర్లు ప్రశ్నించకపోవడం నగరాభివృద్ధి పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమేనని తెలిపారు. గొల్లపాలెంగట్టు కొండ ప్రాంతాల్లో కమిటీ హాలు, రిటైనింగ్ వాల్స్ పనులు మంజూరైన పనులు ప్రారంభించికపోవడం దారుణమన్నారు. డివిజన్ అభివద్ధికి శక్తి వంచన లేకుండా కషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఎం రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లే లలిత ట్రస్ట్ సేవలు శ్లాఘనీయం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ: కళ్లే లలిత ట్రస్ట్ సేవలు శ్లాఘనీయమని పలువురు ప్రశంసలు కురిపించారు. కళ్లే లలిత జ్ఞాపకార్ధం, కళ్లే లలిత వీధిలో బుధవారం పేదలకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళ్లే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు కళ్లే నాగేశ్వరరావు, డైరెక్టర్లు కళ్లే సీతా మహాలక్ష్మి, జయదుర్గ, మేఘవాణి పాల్గొని కళ్లే లలిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో కళ్లే లలిత ట్రస్ట్ ద్వారా పేదలకు మరింత సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్, జి.ధ్రువన్ పాల్గొన్నారు.

గృహోపకరణాలకూ శాంసంగ్ కేర్ ప్లస్ సేవలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అగ్రగామి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్ తమ 'శాంసంగ్ కేర్ ప్లస్' సేవను విస్తరిస్తున్నట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఎయిర్ కండిషనర్లు, మైక్రోవేవ్ ఓవెన్లు, స్మార్ట్ టీవీల వంటి గృహోపకరణాల కోసం ఎక్స్‌టెండెడ్ వారంటీ ప్లాన్లను అందిస్తోందని తెలిపారు. కస్టమర్లు ఇప్పుడు 1 నుండి 4 సంవత్సరాల వరకు ప్లాన్లను ఎంచుకోవచ్చని, ఇవి సమగ్ర రక్షణ, సౌలభ్యాన్ని అందిస్తాయని తెలిపారు. వీటి ధరలు రోజుకు కేవలం రూ.2 నుండే ప్రారంభమవుతాయన్నారు. శాంసంగ్ కేర్ ప్లస్ సేవ పరిశ్రమలోనే మొదటిసారిగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లు, స్క్రీన్ సమస్యలకు కూడా కవరేజీని పరిచయం చేస్తోందని తెలిపారు. శాంసంగ్ కేర్ ప్లస్ ఎక్స్‌టెండెడ్ వారంటీ ప్లాన్‌ల లభ్యతను అన్ని ఛానెళ్లలో విస్తరిస్తున్నామని తెలిపారు.

మోటో జి 67 పవర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మొబైల్ టెక్నాలజీలో ప్రపంచ అగ్రగామి, ప్రముఖ ఏఐ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ అయిన మోటరోలా, మోటో జీ 67 పవర్ ఫోన్ మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ ప్రతినిధి కె.కుమార్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. అత్యుత్తమ బ్యాటరీతో తన అత్యుత్తమ కెమెరా ఫోన్ విడుదల చేస్తున్నట్లు తెలిపారు . ఈ పరికరం సెగ్మెంట్‌లో అన్ని కెమెరాల నుండి 4కె వీడియో రికార్డింగ్‌తో అత్యుత్తమ 600 కెమెరా, స్లిమ్ డిజైన్ కోసం సిలికాన్ కార్బన్ టెక్నాలజీతో రూపొందించారని అన్నారు. రిటైల్ స్టోర్లలో కేవలం రూ.14,999 ప్రత్యేక లాంచ్ ధరకు అమ్మకం ప్రారంభమవుతుందని తెలిపారు.

మనబోతుల శ్రీరామ్‌కు సన్మానం

ప్రజాశక్తి- నందిగామ : రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ మనబోతుల శ్రీరామ్‌ను బుధ వారం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సన్మానించారు. రాష్ట్ర దాసర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల నియమింతులైన శ్రీరామ్.. ఎమ్మెల్యే సౌమ్యను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బచ్చుల సుబ్రహ్మణ్యం, లాల్ బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వీరబాబు, మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, పాల్గొన్నారు.

గ్రావెల్ ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-వత్సవాయి : అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక జెసిబి సీజ్ చేసినట్లు తహశీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు. రాత్రి సమయాల్లో నక్కపేట గ్రామ రెవెన్యూ పరిధిలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆర్ఐ జనార్దన్ రావుతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లారు. అప్పుడే లోడుతో ఉన్న మూడు గ్రావెల్ ట్రాక్టర్లు, ఒక జెసిబి అదుపులోకి తీసుకొని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు.

గుడ్లవల్లేరులో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు బస్టాండ్ సెంటర్లో గల ఆక్రమణలను బుధవారం తొలగింపు చర్యలు చేపట్టారు. కొందరు షాపు యజమానులు రోడ్డు ఆక్రమించి ఐరన్ బోర్డులు కాంక్రీట్ రాంపులు నిర్మించి ఆక్రమించారు. ఆక్రమణలను బుధవారం ఎండి ఎంపీడీవో ఇమ్రాన్ ఆదేశాల మేరకు సానిటరీ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ సానిటేషన్ కాంట్రాక్టర్ మురాల నరేష్ తమ సిబ్బందితో తొలగించగా పంచాయతీ కార్యదర్శి ఏ జె ఎల్ నరసింహారావు పర్యవేక్షించారు.

సహకార వారోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : ఈ నెల 14 నుండి 20 వ తేదీ వరకు జరిగే 72 వ అఖిల భారత సహకార వారోత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ సూచించారు. ఈ సందర్భంగా వారోత్సవాల గోడ పత్రికను బుధవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజులు పాటు నిర్వహించే ఈ వారోత్సవాల్లో ప్రతిరోజు ఒక అంశంపై చర్చించే విధంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా సహకార శాఖ అధికారి కే. చంద్రశేఖర్ రెడ్డి, సహకార శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు మొవ్వ హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-మొవ్వ : ఈ సంవత్సరం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేమ్స్ పోటీలలో పలు అంశాలలో విద్యార్థులు జిల్లా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మొవ్వ పీఎంశ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నిమ్మగడ్డఉమాశ్రీ బుధవారం విలేకరులకు వివరించారు. రాష్ట్రస్థాయికి అండర్ 17 విభాగంలో హై జంప్ కు డి. శామ్యూల్, సాఫ్ట్ బాల్.కు ఎం. సాంబశివరావు,అండర్ 14 బేస్ బాల్. విభాగంలో నవదీప్ స్థానం పొందాడని వివరించారు. అండర్14 లో కబడ్డీపోటీలకు బి. బాల హర్షవర్ధన్, నందేటిసంకీర్త్య, జిల్లాకుఎంపికైన రని వెల్లడించారు. అండర్ 17ఖో-ఖోమరియు వాలీబాల్ లో స్వీటీ, జాహ్నవి, ప్రకాష్, చందు, సమంతాశ్రీ ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. మనోహర్, టీ.వీ. దాన రావు, క్రాంతి, వినీలలను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

శ్మశానవాటికలో ముళ్లపొదలు తొలగింపు

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని యర్రారెడ్డిపాలెంలో శ్మశాన వాటిక రహదారి ముళ్ళపొదలతో నిండిపోయి నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు పడుతున్న సమస్యను గ్రామపంచాయతీ కార్యదర్శి జరుగు నాగ పవన్ కుమార్‌కు తెలియజేయగా వెంటనే స్పందించి జెసిబిని పంపించినట్లు కోడూరు పట్టణ జనసేన అధ్యక్షులు కోట రాంబాబు తెలిపారు. సమస్య చెప్పిన వెంటనే స్పందించిన కోడూరు గ్రామపంచాయతీకి, కార్యదర్శికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. జంగిల్ క్లియరెన్స్ పనులను జనసేన నేతలు పూతబోయిన కరుణ కుమార్, పూతబోయిన సీతారత్న సాయిబాబు, జరుగు ఆదినారాయణ, బచ్చు వెంకటేష్, అప్పికట్ల వినోద్, బండే సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదలు, పిచ్చిచెట్లు తొలగిస్తున్న దృశ్యం

పంచాయతీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-కంకిపాడు : ఉపాధి హామీ నుంచి నుండి రూ.40 లక్షలు మండల పరిషత్ నుండి రూ.13 లక్షలు గ్రామ పంచాయతీ నుండి 11.80లక్షలు కలిపి మొత్తంగా 64.80లక్షల నిధులతో దావులూరు గ్రామ పంచాయతీ కార్యాలయ రెండు అంతస్తుల భవనాన్ని పూర్తి చేసి బుధవారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పిస్తూ, అభివృద్ధి సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఈకార్యక్ర మంలో పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఏ బోడే ప్రసాద్

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - గుడివాడ : 58వ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుండి 20వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఎంవిడిటి నగేష్ తెలిపారు. బుధవారం స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అక్షర జ్ఞానం కలిగి ఉండాలని, గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాలలో యువత, ప్రజానీకం పాల్గొనాలని పేర్కొన్నారు. తెలుగుభాష వికాస సమితి సమన్వయకర్త డి.ఆర్.బి ప్రసాద్, గ్రంథాలయ సిబ్బంది పి.రవిచంద్ పాల్గొన్నారు.

అందెశ్రీకి ఘన నివాళి

ప్రజాశక్తి - గుడివాడ : ప్రజా కవి అందెశ్రీ అస్తమయం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటని సాహితీ ప్రవంతి గుడివాడ శాఖ ఘనంగా నివాళులర్పించింది. మంగళవారం రాత్రి స్థానిక సిఐటియు కార్యాలయంలో సాహితీ ప్రవంతి అధ్యక్షులుసురేంద్ర, కార్యదర్శి వి. కె. కిషోర్, కోశాధికారి వై. కోటేశ్వరరావు, గౌర వాధ్యక్షులు ఎ. వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరచే విధంగా పలు పాటలు అందెశ్రీ స్వయంగా రచించి ఆలపించారన్నారు. పాఠశాల విద్య లేక పోయినా, పేదల కష్టాలను చూసి స్వయంగా అనుభవించి రాసిన గేయాలు ప్రజల గుండెలో చిరస్థాయిగా నిలిచి పోతాయన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-మొవ్వ : అక్టోబర్ నెలలో సంభవించిన మొంథా తుపాను కారణంగా భారీ వృక్షం కూలి ఇళ్ళు కోల్పోయిన మొవ్వ మండలం బార్లపూడి రోడ్‌లో పెట్రోల్ బంకు పక్కన పేరుమోను సీతమ్మ అంగలవాణీలకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఒక్కొక్క కుటుంబానికి మూడు వేల రూపాయల చొప్పున మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కూచిపూడి గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మొవ్వ మండల శాఖ ఛైర్మన్ పిట్టు శ్రీనివాసరావు, కన్వీనర్ తాళ్లూరి మోహన్ కుమార్, సెక్రటరీ మాతంగి కిషోర్ బాబు, డైరెక్టర్లు వేదాంతం రాదేశ్యాం, పాగోలు రమేష్ పాల్గొన్నారు.

ఖోఖోలో ఎన్‌టిఆర్ స్టేడియం క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - గుడివాడ : ఈ నెల 8 నుండి 10వ తేది వరకు విజయనగర్‌లో జరిగిన అండర్ -19 రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలలో ఎన్‌టిఆర్ స్టేడియం క్రీడాకారులు కంచు పతకం సాధించడం అభినందనీయమని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ఖో-ఖో పోటీలలో కంచు పతకం సాధించిన విజేతలను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్.టి.ఆర్. స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని తతీయ స్థానం కైవసం చేసుకుని కంచుపతకం సాధించడం జరిగిందన్నారు. ఈ పోటీలలో పాల్గొన్న డి. రాకేష్, యమ్. లక్ష్మీధర్‌లు జనవరి నెలలో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక అవడం గుడివాడకే గర్వకారణమన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కార్యదర్శి, కిలారపు రంగప్రసాద్ ఖో-ఖో కోచ్ కత్తి చైతన్య, కృష్ణాజిల్లా ఖో-ఖో అధ్యక్షులు, మడకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

స్టీల్ ప్లేట్లు వితరణ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదానశాలకు భక్తుల సౌకర్యార్థం మచిలీపట్నంకు చెందిన ఉప్పాల రఘురాం 500 స్టీల్ ప్లేట్లు కానుకగా అందజేశారు. ఆలయ సూపరింటెంట్ అచ్యుత మధుసూదన్ రావుకు వీటిని అందజేయగా ఆలయ మర్యాదలతో రఘురాంను సత్కరించారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-మొవ్వ :మాజీ ఎంఎల్సీ, ప్రస్తుత జెవివి రాష్ట్ర అధ్య క్షులు కె.యస్. లక్ష్మణ రావుచే రచించిన జాతీయ మెరిట్ స్కాలర్షిప్ పుస్తకాలను బుధవారం పెదపూడి జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో 8వతరగతి జాతీయ మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలు రాస్తున్న 10 మంది విధ్యార్థిని, విద్యార్థులకు యుటియఫ్ మొవ్వ మండల ప్రధాన కార్యదర్శి ఎం రత్నగిరి రావు పంపిణీ చేశారు. గౌరవ అధ్యక్షులు పాగోలు రమేష్ బాబు, కోశాధికారి కే శివ నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు ఎస్ ఎస్ నాగమల్లేశ్వరావు పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించారు.

నూతన వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి-పామర్రు : స్థానిక ఏఎన్ఎం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ అన్నపురెడ్డి పూర్ణచంద్రారెడ్డి తన కుటుంబంతో కలిసి ఆయన తల్లి కోటేశ్వరమ్మ ద్వితీయ సంవత్సరీకం సందర్భంగా పామర్రులోని వాసవి వద్ధాశ్రమంలో వృద్ధులకు మిఠాయిలు,పళ్ళు,నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శీతాకాలం దశ్య వృద్ధులకు దుప్పట్లను అందించినట్లు పూర్ణచంద్ర రెడ్డి తెలిపారు.

వస్త్రాలు అందిస్తున్న దృశ్యం

వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

ప్రజాశక్తి-ఘంటసాల : గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ అయినపూడి భాను ప్రకాష్ అన్నారు. స్థానిక పెద్ద కళ్ళాణ మండపంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా శిబిరాన్ని ఆయన పరిశీలించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. దివ్య శంకర్ చిల్డ్రన్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పిల్లల వైద్య నిపు ణులు డాక్టర్ జె వి బి శంకర్రావు ఆధ్వర్యంలో ఉచిత మెగా శిబిరాన్ని నిర్వహిస్తున్నారని, మందులు టెస్టు అన్ని ఉచితంగా చేస్తారని తెలిపారు. కొండపల్లి వెంకట కష్టారావు, అక్బర్ బాషా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాయన వెంకట్ మహారాష్ట్రలోని జలగావ్ నగరంలో గాంధీ రీ చర్చ్ ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన జాతీయ గాంధీ తత్వనాయకత్వ శిబిరం 2025కు ఎంపికై 12 రోజులపాటు శిక్షణ పొందడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అభినందనలు తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి ఇంటర్వ్యూలో ఎంపికైన పదిమందిలో అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి వెంకట్ ఎంపికై గాంధీజీ ఆదర్శ భావా లను, నాయకత్వ లక్షణాలను భావితరాలకు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి హాజరు కావడం గర్వకారణం అన్నారు. జలగావు నుండి తిరిగివచ్చిన వెంకట్‌ను ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షునిగా వేణుగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : టిడిపి రెడ్డిగూడెం మండలం అధ్యక్షుడుగా జానలపాటి వేణుగోపాల్ రెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. మైలవరం నియోజక వర్గానికి చెందిన టిడిపికి సంస్థాగత పదవులు, అనుబంధ సంఘాల పదవులు పొందిన నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జి. కొండూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి కెవివి సత్యనారాయణ, తెలుగు యువత విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షులు పైడిమర్ల కిరణ్ కుమార్ రెడ్డి, రెడ్డిగూడెం పిఎసిఎస్ అధ్యక్షుడు ఉయ్యూరు సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-వీరులపాడు : వీరులపాడు మండలం కొణతాలపల్లి గ్రామంలోని బిసి కాలనీలో మంగళవారం రాత్రి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహ విష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో సౌమ్య మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో ఎన్‌టిఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమైనవని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడం మనందరి బాధ్యతని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, మద్దినేని లక్ష్మణరావు, తోట రవి, ఎర్రం రెడ్డి వెంకటేశ్వరరావు, భారత రెడ్డి, గువ్వల సత్యనారాయణ, డీసీ చైర్మన్ కాపా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి వల్లభాయ్ పటేల్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మైలవరం : సర్దార్ వల్లభాయ్ పటేల్ మహోన్నతమైన గొప్ప వ్యక్తి అని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. మై భారత్ (నెహ్రూ యువ కేంద్ర) జిల్లా ఆధ్వర్యంలో బుధవారం సర్దార్ యూనిటీ మార్చ్ ర్యాలీని ఎల్‌బిఆర్‌సిఈ కళాశాల వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా స్వాతంత్రం అనంతరం దేశ ఐక్యతను సాధించిన మహానేతగా చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించారన్నారు. ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దేశీయ సంస్థానాలను భారత దేశంలో విలీనం చేయించడంలో ఆయన కృషి మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువ అధికారి సుంకర రాము, మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు, ఎల్‌బిఆర్‌సిఎ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ లక్కిరెడ్డి హనిమిరెడ్డి, జిల్లా యువజన సంక్షేమ శాఖ మేనేజర్ సుబ్బారావు, ఎల్‌బిఆర్‌సిఈ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ అప్పారావు, పాల్గొన్నారు.

రహదారికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం కేరళ హోటల్ సమీపంలోని ఎపిహెచ్‌ఎమ్‌ఎల్ కాలనీలో రోడ్డుకు స్థానిక కౌన్సిలర్ ఉప్పుతల గోపాలరావు, కొండపల్లి పురపాలక చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.8 లక్షల సిఆర్ఎ నిధులతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చిట్టిబాబు మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

తాగునీరు అందించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-వత్సవాయి : వత్సవాయి మండలంలోని ఆరు గ్రామాలకు తాగునీరు అందించాలని సిపిఎం నాయకులు సిహెచ్ హనుమంతరావు, బి.రాము.. జిల్లా కలెక్టర్‌ను కోరారు. వత్సవాయిలో జరిగిన పిఎం జన్‌మన్ గృహాల ప్రారంభోత్సవానికి హాజరైన కలెక్టర్ జి.లక్ష్మీశ, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌ను బుధవారం సిపిఎం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వత్సవాయి, దబ్బాకుపల్లి, పోచవరం, గంగవల్లి, లింగాల, పోలంపల్లి, పెంటల వారి గూడెం గ్రామాలకు గత 12 రోజులుగా ప్రజలకు తాగునీరు అందడంలేదనీ, మొంథా తుపాను వల్ల వచ్చిన అకాల వరదల వల్ల లింగాల గ్రామం వద్ద మున్నేటి కాజ్వేపై వేసిన మంచినీటి పైపులైన్లు కొట్టుకొని పోయాయని తెలిపారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి మంచినీరు అందించాలని కోరారు. అకాల వర్షం వల్ల పత్తి పంట తీవ్రంగా దెబ్బతిందని, పంట నష్టపోయిన రైతులకు, కౌలురైతులకు నష్ట పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

నిరాశ్రయులకు 'రెడ్ క్రాస్ - మనో బంధు' సాయం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మానసిక రుగ్మతలతో బాధపడుతూ వీధుల్లో నిరాశ్రయులుగా సంచరించే వారిని గుర్తించి, వారికి వైద్య సేవలందించి, అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించే 'సేవా కార్యక్రమాన్ని 'రెడ్ క్రాస్ – మనో బంధు' స్వచ్ఛంద సేవా సంస్థ చేపట్టడం అభినందనీయమని సిఐ పి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ మనోహర్‌తో కలిసి ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, మనో బంధు జిల్లా కన్వీనర్ కర్లపాటి వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ మతిస్థిమితం సరిగా లేని నిరాశ్రయులకు సహాయం అందించడమే లక్ష్యంగా రెడ్ క్రాస్ సొసైటీ మనోబంధు ఫౌండేషన్ రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. తహశీల్దార్ మనోహర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సేవలు అమూల్యమైనవని ప్రశంసించారు.

వికలాంగులకు కో ఆపరేటివ్ సంఘాలు ఏర్పాటు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వికలాంగులను సంఘటిత పరిచి వారి ఆర్థిక అవసరాలు తీర్చడం కోసం గ్రామ, మండల స్థాయిలలో కో ఆపరేటివ్ సంఘాలు ఏర్పాటు చేయనున్నట్లు స్వయంశక్తి వికలాంగుల సంక్షేమ, అభివృద్ధి సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వడ్డెపూడి ఉమా మహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వికలాంగుల ఆర్థికంగా ఆదుకునే విధంగా సంఘాలు పనిచేస్తాయని తెలిపారు. సేవా భావం ఉన్న 40 సంవత్సరాల లోపు యువతీయువకులు, స్వచ్ఛంద కార్యకర్తల నుండి దరఖాస్తులను కోరుతున్నామని తెలిపారు. ఈ స్వచ్ఛంద కార్యకర్తలను సేవా కార్యక్రమాలపై శిక్షణ ఇస్తారని, పనితీరు, ప్రవర్తన బాగుంటే వారికి స్వయం శక్తి సంస్థ ఉద్యోగులుగా తీసుకొని వారికి సరైన గౌరవవేతనం కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. త్వరలో జరిగే మౌఖిక, రాత పరీక్షల ద్వారా వారిని ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ బయోడేటాను నవంబర్ 23వ తేదీలోపు వడ్డేపూడి ఉమా మహేశ్వరరావును సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 9908034300 సంప్రదించండని కోరారు.

జానకి రామయ్యకు నివాళి

ప్రజాశక్తి - తిరువూరు : కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలోని విజయా డెయిరీ మాజీ చైర్మన్ మండవ జానకి రామయ్యకు తిరువూరు పాల సీతల కేంద్రంలో బుధ వారం సంతాప సభ నిర్వహించారు. పాల శీతల కేంద్రం పరిధిలోని పాల సొసైటీ కేంద్రాల కార్యదర్శులు, అధ్యక్షులతో కలిసి విజయా డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు.. జానకి రామయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సుమారు 27 సంవత్సరాలపాటు విజయ డెయిరీ చైర్మన్‌గా మండవ జానకి రామయ్య సుదీర్ఘకాలం సేవలందించారని ఆంజనేయులు కొనియాడారు. ఈ కార్యక్రమం విజయా డైరీ జిల్లా పాలకవర్గ సభ్యులు బొట్టు రామచంద్రరావు, నెక్కళ్లపు వాణిశ్రీ, జిల్లా ట్రస్ట్ సభ్యులు పల్లాటి సత్యనారాయణ, ముక్కమాల విజయలక్ష్మి, ఫీడ్ కమిటీ సభ్యులు సూరయ్య, మేనేజర్ దిలీప్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వత్సవాయి : పేదల సొంతింటి కలలను కూటమి ప్రభుత్వం సాకారం చేస్తోందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తెలిపారు. మండల కేంద్రమైన వత్సవాయిలో బుధవారం పిఎం జన్‌మన్ గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కలెక్టర్ జి.లక్ష్మీశ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ చొరవతో కేవలం 17 నెలల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల గృహాలను పేదలకు మంజూరు చేయడం చారిత్రాత్మక ఘనతగా అభివర్ణించారు. నియోజకవర్గం వ్యాప్తంగా గృహాలకు సామూహిక గృహప్రవేశాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కూటమి సర్కార్ పేదలకు సౌకర్యవంతమైన గృహాలు అందిస్తూ, వారికి ఆర్థిక భద్రత కల్పించే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ బాలకృష్ణ, వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, హౌసింగ్ పీడీ, అధికారులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని 24వ వార్డులో శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్‌పర్సన్ రంగాపురం రాఘవేంద్ర బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని నీటి సరఫరా, డ్రైనేజ్, లైటింగ్, పరిశుభ్రత అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ.. ఈ వేసవిలో మంచినీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్వచ్ఛ జగ్గయ్యపేట లక్ష్యాన్ని కొనసాగించేందుకు శానిటేషన్ పనులను మరింత బలోపేతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రాఘవేంద్రకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా, వార్డు కౌన్సిలర్ సదుపాటి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షునిగా వేముల

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా 79వ కౌన్సిల్ సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా వేముల భిక్షమయ్య, ప్రధానకార్యదర్శిగా జి.అనుగ్రహ ప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా ఎం.శ్రీహరి 3వ సారి 2025-27 సంవత్సరానికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గంలో జిల్లా సహాధ్యక్షుడుగా టి.వి.ఎల్.నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షుడుగా కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శిగా బి.శ్రీనివాసరావులను నియమించారు. వీరికి జగ్గయ్యపేట, వత్సవాయి నాయకులు ఎం.శ్రీహరి, పి.డి.వి.ప్రసాదరావు, జి.రవి, రాజేంద్ర, జె.వెంకటేశ్వర్లు, పి.ఆనంద్ కుమార్, ఎస్.నరేష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కొండపల్లిలో విద్యుత్ అధికారుల దాడులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లి సెక్షన్‌లోని ఇబ్రహీంపట్నం డివిజన్‌కు సంబంధించిన విద్యుత్ సర్వీసులను విద్యుత్ అధికారుల బృందాలు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్తును అందించే క్రమంలో విద్యుత్ చౌర్యాన్ని అరికట్టే చర్యల్లో భాగంగా కొండపల్లిలో 42 బృందాలుగా ఏర్పడిన విద్యుత్ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారుగా 4,500 సర్వీస్‌లను తనిఖీ చేసినట్టు చెప్పారు. మాల్ ప్రాక్టీస్ కేసులు 3 గుర్తించినట్లు తెలిపారు. అదనపు విద్యుత్ లోడ్‌నకు సంబంధించి రూ.7 లక్షలు జరిమానాలు విధించి, నోటీసులు అందజేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలు ప్రతినెలా ఒక సెక్షన్‌లో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు హనుమయ్య, వసంతరావు, గురు కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సొంతింటి కల ప్రభుత్వ ధ్యేయం

బందరులో..

ప్రజాశక్తి-పామర్రు : పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనేది కూటమి ప్రభుత్వ ధ్యేయం అని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక ఇందిరా నగర్ లోని జ్యోతి, మాణిక్యాలరావుకు చెందిన నూతన గృహాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పామర్రు నియోజక వర్గంలో 731 నూతన గృహాలు ప్రారంభిస్తున్నామన్నారు. ఇంటి నిర్మాణానికి 2 లక్షల 50 వేల తో పాటు ఎస్సీలకు 75 వేలు, ఎస్సీ బీసీలకు 50 వేల రూపాయలు అదనంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్,హౌసింగ్ డిఈ శివప్రసాద్, ఏఈ పవన్ కళ్యాణ్, పామర్రు పట్టణ టిడిపి అధ్యక్షుడు పరసా సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరూ సొంతింటి కల నిజం చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో పేదలందరూ సొంతింటి కల నిజం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుచే రాయచోటిలో 3,00,192 గృహ గహ ప్రవేశాల ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో నగరంలోని చింతగుంట పాలెంలో పి ఎం ఏ వై అర్బన్ 1.0 పథకం కింద కుప్పా శ్రీనివాసరావు, సిద్దినేని యానాది రావు నిర్మించుకున్న గహాలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తో కలిసి ప్రారంభించారు. అనంతరం కటకం లక్ష్మీనారాయణ ఫణి కుమారీలకు చెందిన పీఎం ఏవై 2.0 గృహ నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. అనంతరం దేశాయిపేటలో ఉన్న శ్రీ విన్నకోట వెంకట స్వామి నాయుడు కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సభా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు,ఈఈ. వెంకటరావు, రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ లంకె నారాయణ ప్రసాద్, రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ కార్పోరేషన్ డైరెక్టర్ పివి ఫణికుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గన్నవరం : పేదలందరికీ గహవసతి కల్పించాలని లక్ష్యంతో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకాన్ని వినియోగించుకుని లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించు కోవాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపు నిచ్చారు. గన్నవరం ఐటీ కళాశాల రోడ్డో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మహమ్మద్ జహీరా నూతనంగా ఇల్లు నిర్మించుకోగా బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే వెంకట్రావ్ దగ్గరుండి లబ్ధిదారులతో గహప్రవేశం చేయించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఓసి లబ్ధిదారులకు రూ. 1.80 లక్షలు, బీసీ,ఎస్సీ లబ్ధిదారులకు రూ.2.30 లక్షలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.2.75 లక్షలు ప్రభుత్వం ఉచితంగా సాయం అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మద్దినేని వెంకటేశ్వరరావు మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, టిడిపి నాయకులు పొలదుగు నాని, కాసరనేని రంగబాబు, మేడేపల్లి రమ తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ** : కూటమి ప్రభుత్వం పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తుందని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 3 లక్షల పక్కా గృహ ప్రవేశాల వేడుక నియోజకవర్గ స్థాయి కార్యక్రమం అవనిగడ్డ మండలం పులిగడ్డలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్ను గణేష్ బాబు ఇంటిని వెంకటరామ్, గహ నిర్మాణ శాఖ అధికారులు ప్రారంభించారు. ఎంపీడీవో మరియాదేవి, వైస్ ఎంపీపీ పులిగడ్డ. పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు చెన్ను బాబురావు, చెన్ను శివాజీ, మండలి శేషు పాల్గొన్నారు.**ప్రజాశక్తి - గుడివాడ** : గుడివాడ రూరల్ మండలంలోని తట్టివర్రు గ్రామంలో గృహప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళీ, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి, ఎంపిడివో బివై విష్ణుప్రసాద్‌లు మాట్లాడారు. టిడిపి నాయకులు చేకూరి జగన్మోహనరావు, పంద్రాజు సాంబశివరావు, జనసేన మండల అధ్యక్షులు ఇంటూరి గజేంద్ర, గ్రామ సర్పంచ్ గంజి నిర్మలకుమారి పాల్గొన్నారు.

గుడివాడలో...

పామర్రులో...

బాలల దినోత్సవం రోజు పరీక్షలు నిర్వహించడం తగదు

ప్రజాశక్తి-ఉయ్యూరు : బాలల దినోత్సవం రోజున ఎస్ఎ1 పరీక్ష నిర్వహించడం చాలా దుర్మార్గమైన ఆలోచనని, దీనిని ఖండిస్తున్నామని కృష్ణాజిల్లా చిల్డ్రన్ క్లబ్ కన్వీనర్ బి. కీర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేస్తూ నవంబర్ 14 బాలల దినోత్సవం అనేది పిల్లల హక్కులను కాపాడుతూ, వారి సృజనాత్మకతను, చైతన్యాన్ని గుర్తించే రోజని, దేశవ్యాప్తంగా పిల్లలలో సామాజిక అవగాహన, సజనాత్మకత, సాంస్కృతిక వ్యక్తీకరణను ప్రోత్సహించే అనేక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. అయితే, ఈ ప్రత్యేకమైన రోజున పాఠశాలల్లో ఎస్ఎ 1 పరీక్షలు నిర్వహించడం చాలా విచారకరమని, ఇది బాలల హక్కుల పట్ల నిర్లక్ష్యాన్ని, వారిపై మానసిక ఒత్తిడిని ప్రతిబింబిస్తుందన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునరాలోచించి, బాలల దినోత్సవం రోజున పరీక్షను రద్దు చేసి, పాఠశాలల్లో సామూహిక కార్యక్రమాలు, పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా సూచనలు జారీ చేయాలని కీర్తి కోరారు.

నూతన కమిటీలు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పెడన : పెడన నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కమిటీలతో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, నియోజ కవర్గ పరిశీలకులు గొట్టిముక్కల రఘురా మరాజు బుధవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి చేరవేయాలన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

బండారు దత్తాత్రేయకు ఆహ్వానం

ప్రజాశక్తి-అవనిగడ్డ : మాజీ గవర్నర్ బండారు దత్తాత్రే యను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కలిసి ఉప్పెన మృతుల స్మరక సభకు రావాలని ఆహ్వానం పలికారు. ఈ మేరకు బుద్ధప్రసాదు పాత్రికే యులకు సమాచారం అందిస్తూ బుధవారం హైదరాబాదులోని దత్తాత్రేయ స్వగహంలో కలిసి ఈ నెల 19వ తేదీ అవనిగడ్డలో గాంధీ క్షేత్రంలో జరిగే 48వ దివిసీమ ఉప్పెన స్మారక సభకు ఆహ్వానించినట్లు తెలిపారు. ఉప్పెన ప్రభావిత గ్రామాలకు ఆనాడు దత్తాత్రేయ చేసిన సహాయం అపూర్వమన్నారు.

ఆధార్ సేవలు వేగవంతం

ప్రజాశక్తి-చల్లపల్లి : ఆధార సేవలు సర్వర్ సమస్యలు లేకుండా వేగంగా అందిస్తామని మచిలీపట్నం డివిజన్ పోస్టల్ జోన్ సూపరిండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన చల్లపల్లి పోస్ట్ ఆఫీస్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఖాతాదారులు, ప్రజలతో మాట్లాడి ఇక్కడికి పోస్ట్ ఆఫీస్ లో అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూపరిండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి ఆధార్ సేవలు అందించడంలో సర్వ సమస్యలు వచ్చాయని, వాటిని సరిచేశామన్నారు. పోస్ట్ ఆఫీస్‌లో మాత్రమే లభ్యమయ్యే గ్రూపు యాక్సిడెంట్(జీఏజీపి) ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కేవలం 795 రూపాయలు కట్టి తీసుకోవడం వల్ల ప్రమాదంలో మరణిస్తే రూ. 15 లక్షల వరకు, అలాగే గాయాలతో ఆసుపత్రి చేరితే రూ. లక్ష వరకు బీమా అందుతుందని వివరించారు.

పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-మోపిదేవి : తెలుగుదేశం పార్టీ తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన మోపిదేవిలోని టిడిపిక కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఏర్పాటు చేసిన కేకును రావి రత్నగిరి చేత కట్ చేయించారు. పలువురు వివిధ స్థాయిలోని నేతలు రత్నగిరికి కేకును తినిపించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ర్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నడకుదిటి జనార్ధనరావు, సీనియర్ నాయకులు రావి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ వేములపల్లి రవిచంద్ర, పిఏసీఎస్ చైర్మన్ బళ్ల సీతారామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలోని చెట్టు తొలగించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : పాఠశాల ఆవరణలో గానుగ చెట్టును తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మండల పరిధిలోని నడకుదురు పంచాయతీ శివారు రాముడు పాలెం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పెరిగిన చెట్టు వల్ల ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆరోపిస్తు న్నారు. పాఠశాల ఆవరణలోని చెట్టు పెరిగి కొమ్మలు విపరీతంగా పెరిగి,పక్కా భవనాలపై విస్తరించటంతో, కొమ్మలనుండి రాలిన ఆకులు భవనాల పై కప్పుపై పడటంతో, పైభాగం పాడవటానికి అవకాశ ఉందన్నారు. పాఠశాల ఆవరణలో చెట్టు విస్తారంగా విస్తరించడం వల్ల చెట్టు కొమ్మలపై పక్షులు రెట్ట వేయటంతో దుర్వాసన జరుగుతుందని విద్యార్థులు తెలిపారు. దుర్వాసన విపరీతంగా రావడం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు వండే భోజనాన్ని ఇంటి వద్దే తయారు చేసి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

సభ్యత్వం నమోదు

ప్రజాశక్తి - గుడివాడ : ఈనెల 31వ తేదీ లోపు జిల్లాలో అన్ని ఎన్‌జీవోస్ యూనిట్లకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకూరి శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం స్థానిక ఎన్‌జీవోస్ కార్యాలయంలో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు ప్రచార కార్యక్రమాన్ని గుడివాడ అర్బన్ మండలాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్జీవోస్ పరిధిలోకి వచ్చిన సచివాలయ ఉద్యోగులు, గజిటెడ్ ఆఫీసర్స్‌లకు సభ్యత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు షేక్ ఫరీద్‌భాష, ఉపాధ్యక్షులు కె.రామ్మోహ న్రావు, గుడివాడ తాలూకా అధ్యక్షులు కెపి రావు ప్రధాన కార్యదర్శి జి.రాంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫణికుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : నీతినిజాయితీలతో పార్టీ కోసం పనిచేసే వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయని కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణయాదవ్ అన్నారు. పివి ఫణికుమార్‌కు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌లో రాష్ట్ర డైరెక్టర్ పదవి వచ్చినందుకు బుధవారం ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సేవలందించే వ్యక్తికి బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌లో డైరెక్టర్ పదవి రావడం పట్ల అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పదవికి న్యాయం చేసేలా రాష్ట్రంలో ఎంతోమంది నిరుపేద బ్రాహ్మణులకు అండగా నిలబడి వారికి ప్రభుత్వపరంగా అందే పథకాలను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వాలిశెట్టి తిరుమలరావు, యాదవ సంఘం అధ్యక్షుడు, చినబాబు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం విజిలెన్స్ అవగాహన వారోత్స వాలను నిర్వ హిం చారు. యూని యన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మచిలీపట్నం రీజినల్ ఆఫీస్ హెడ్ కె. వెంకటరావు, రీజినల్ విజిలెన్స్ ఆఫీసర్ కె.వెంకటరాజు, చల్లపల్లి బ్యాంకు మేనేజర్ వెంకట్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థుల్లో అవగాహన పెంపొంది ంచేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా రీజినల్ హెడ్ వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి నడవడికను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం ఎం.రాజా, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

- సిఐటియు సెంట్రల్ సిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి సుధాకర్, కె.దుర్గారావు పిలుపు

ప్రజాశక్తి-విజయవాడ : కార్మికుల హక్కులను కాపాడుకోవడం కోసం కార్మికులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు సెంట్రల్ సిటీ నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు ఎం.వి సుధాకర్, కె.దుర్గారావు పిలుపు నిచ్చారు. సిఐటియు సెంట్రల్ సిటీ 18వ మహాసభ మంగళవారం స్థానిక మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విషయం తెలిసిందే. ఈ మహాసభలో కార్యదర్శి ఎం.వి సుధాకర్ ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికను మహాసభకు హాజరైన ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మహాసభలో చేసిన తీర్మానాలు, నూతన కార్యవర్గాన్ని గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి సుధాకర్, కె దుర్గారావు మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు కార్మిక చట్టాలను బడా కంపెనీల యజమానులకు అనుకూలంగా మారుస్తూ కార్మికుల హక్కులను కాల రాస్తున్నారని దుయ్యబట్టారు. కార్మికుల హక్కులను కాపాడుకోవడం కోసం కార్మికులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. సిఐటియు అఖిలభారత మహాసభలు డిసెంబర్ 31నుండి జనవరి 4వరకు విశాఖపట్నంలో జరుగుతున్నాయని, 4వ తేదీన జరిగే మహా ప్రదర్శన, బహిరంగ సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈమహాసభలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించ బడుతుందని తెలిపారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఎం. సీతారాములు, వై,సుబ్బారావు, ఎం.హనుమంతరావు, సి.హెచ్ మురళి, ఎం.వి రమణ, టి.తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

42 మందితో నూతన కమిటీ

సిఐటియు విజయవాడ సెంట్రల్ సిటీ నూతన కమిటీ 42 మందితో ఏర్పడింది. నూతన అధ్యక్షులుగా ఎం.వి.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కె.దుర్గారావు, కోశాధికారిగా వై.సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా ఎం.సీతా రాములు, ఎం.వి రమణ, ఎం.హనుమంతరావు, టి.గజలక్ష్మి, బి.గోవిందులను ఎన్నుకోగా, కార్యదర్శులుగా టి.ప్రవీణ్, ఎం.బాబురావు, ఎం.సోమేశ్వరరావు, సి.హెచ్ మురళి, టి.తిరుపతమ్మ, సిహెచ్.మహేష్‌లను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

చేసిన తీర్మానాలు ఇవే...

మహాసభలో చేసిన పలు తీర్మానాలను మహా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కూలి రేట్లు పెంచాలని, మహిళలకు ఉచిత బస్సు కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్క ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.25 వేలు నష్టపరిహారం అందించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జి.వో 21 రద్దు చేయాలని, షాపు ఉద్యోగులకు కూర్చోవడానికి అవకాశం కల్పించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, బిల్డింగ్ కార్మికులకు సంక్షేమ బోర్డు, గుర్తింపు కార్డులు అమలు చేయాలని, చిరు వ్యాపారస్తులు (హాకర్స్) కి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పాలక పార్టీ అధికారల వేధింపులు ఆపాలని, హోటల్ రంగ కార్మికులకు లేబర్ చట్టాలను అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం ఆపాలని, అంగన్వాడి, ఆశా, మధ్యాహ్నం భోజనం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, పలు తీర్మానాలు ఆమోదించి భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించాలని మహా సభ తీర్మానాలు చేసింది.

వినోదాత్మకంగా వీఆర్ ఈవెంట్స్ విభావరి

విజయవాడ : వి.ఆర్.ఈవెంట్స్ (గుంటూరు) ఆధ్వర్యంలో బుధవారం రాత్రి గాంధీనగర్ ఆశీష్ స్టూడియోలో సినీ సంగీత విభావరి వినోదాత్మకంగా జరిగింది. సంస్థ అధినేత్రి, ప్రముఖ గాయని చింతా రజిని జన్మదిన వేడుకల్లో భాగంగా జరిగిన ఈ సినీ పాటల కచేరీలో బిళ్లా అశోక్, వై. శ్రీనివాసరెడ్డి, ఆవుల రామకోటేశ్వరరావు (రాము), కొండా కోటిరెడ్డి, పసుపులేటి శ్రీనివాసరావు, లయన్ కొండేటి శ్రీదుర్గా నాగమణి, సంస్థ అధినేత వాసు, ట్రాక్స్ అధినేత సూర్య, పసుపులేటి శ్రీనివాసరావు, ఎస్ నాగేంద్ర (తెలుగుదేశం నాయకులు), రాయరాజు తదితరులు పాడిన ఆయా చిత్రాల హిట్ సాంగ్స్ ప్రేక్షకుల్ని అలరించాయి. కే డేవిడ్ రాజు, సిహెచ్ చిట్టిబాబు, కారుమంచి రాజు, ఆర్.మధుసూదన రావు తదితరులు ఈవెంట్స్ అధినేతల్ని అభినందించారు. పలువురు గాయకులు, వివిధ సంస్థల అధినేతలు, ప్రతినిధులు రజనీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కరాటేలో శ్రీనిధి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తిరువూరు : జాతీయ స్థాయి కరాటే పోటీలలో తిరువూరు శ్రీనిధి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఆర్.వెంకట నారాయణ తెలిపారు. ఆయుష్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా నిర్వాహకులు నల్లగొండ జిల్లా దేవరకొండలో నిర్వహించిన కరాటే పోటీలలో సబ్ జూనియర్స్ కటా విభాగంలో యుకేజి విద్యార్థి నండికొల్ల నిశ్చయనిస్సి, జూనియర్ కటా విభాగంలో జోనాదుల నాగ చైత్రేష్ ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, కరాటే మాస్టర్ మరకాల రేవంత్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు కరెస్పాండెంట్ ముత్యాల కిషోర్ బాబు అభినందనలు తెలిపారు.

నూర్ భాషాల కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన టిడిపి నేత రమణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ నూర్ భాషా దూదేకుల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా నాగుల్ మీరాను టిడిపి సీనియర్ నాయకులు పేరాబత్తుల రమణ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని ఈ సందర్భంగా పేరాబత్తుల రమణ పేర్కొన్నారు. నాగుల్ మీరాని కలిసిన వారిలో 48వ డివిజన్ టీడీపీ కమిటీ సభ్యులు ఉన్నారు.

ప్రజా భద్రతకు సిసి కెమెరాలు దోహదం : సిఐ

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : ప్రజల భద్రత, నిఘాకు సీసీ కెమెరాలు దోహదపడతాయని భవానీపురం స్టేషన్ సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ సుమన్ పేర్కొన్నారు. మంగళవారం భవానీపురం ఊర్మిళానగర్ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో సీసీ కెమెరా దృశ్యాలు ఎంతో కీలకంగా మారాయని వెల్లడించారు. భవానీపురం స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏకలవ్యనగర్, ప్రజాశక్తినగర్, సీతారెడ్డి, బొమ్మరెడ్డినగర్, నులకపేట తదితర ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాటి శ్రీధర్, టిడిపి 43వ డివిజన్ అధ్యక్షుడు మోరబోయిన రాంబాబు పాల్గొన్నారు.

14న 'మీ డబ్బు - మీ హక్కు' ప్రత్యేక శిబిరం

- లీడ్ బ్యాంకు మేనేజర్ కె.ప్రియాంక

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ : మీ డబ్బు-మీ హక్కు నినాదంతో భారత ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఈ ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోందని.. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ మార్గనిర్దేశనం మేరకు ఈ నెల 14న కలెక్టరేట్‌లో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా ఎల్‌డీఎం కె.ప్రియాంక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మీ డబ్బు - మీ హక్కు కార్యక్రమం ద్వారా పదేళ్లు, అంతకు మించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును బ్యాంకులు అర్హులకు తిరిగి ఇచ్చేయడం జరుగుతుందన్నారు. ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు లేదా నామిని వివరాల్లో లోపాలు, మరచిపోవడం వంటి కారణాలతో కొన్ని ఖాతాల్లోని డబ్బు లబ్ధిదారులకు చేరడం లేదన్నారు. ఇలా ఎన్‌టీఆర్ జిల్లాలో మొత్తం 5,50,778 బ్యాంకు ఖాతాల్లో రూ. 145.47 కోట్లు ఉన్నట్లు వివరించారు. వీటికి సంబంధించిన వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు సరైన ధ్రువపత్రాలతో ఈకేవైసీ పూర్తిచేసి తమ సొమ్మును తిరిగి పొందవచ్చన్నారు. ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన డీసీసీ-డీఎల్‌ఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ వారు యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, ఆర్‌బీఐ అధికారి నవీన్ తదితరులతో మీ డబ్బు - మీ హక్కు ప్రత్యేక కార్యక్రమంపై చర్చించి.. శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, వివిధ బ్యాంకుల అధికారులతో కలిసి ప్రచార కార్యక్రమ పోస్టర్లను కూడా ఆవిష్కరించడం జరిగిందని ఎల్‌డీఎం ప్రియాంక తెలిపారు..

అట్టహాసంగా సామూహిక గృహప్రవేశాలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారులు సొంతిల్లు కట్టుకోవడానికి అవకాశం కల్పించి పేదల కలను కూటమి ప్రభుత్వం నిజం చేసిందని టిడిపి 56, 57 డివిజన్ల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ దనేకుల వెంకట సుబ్బారావు అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని కూటమి పార్టీల నేతలు బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. పాత రాజరాజేశ్వరి పేట, మెయిన్ రోడ్‌కు చెందిన లబ్ధిదారు యలమంచిలి మంగ, అల్లు అప్పల నాయుడు నగర్‌కు చెందిన లబ్ధిదారు నక్కెళ్ళ శ్రీనుల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. 56వ డివిజన్, పాత రాజరాజేశ్వరి పేటలో నిర్వహించిన గృహప్రవేశాల కార్యక్రమంలో 55, 56, డివిజన్ల టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ దనేకుల వెంకట సుబ్బారావు, హౌసింగ్ ఈఈ కపూర్, హౌసింగ్ డీఈ విజయ్, ఏఈ ఇర్ఫాన్, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ ప్రాణాలను కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-విజయవాడ : చనిపోవడానికి ప్రయత్నించిన ఓ మహిళ ప్రాణాలను ట్రాఫిక్ పోలీసులు కాపాడారు. కృష్ణా జిల్లా ఉయ్యూరు గ్రామానికి చెందిన ఓ వివాహిత కుటుంబ సమస్యల నేపథ్యంలో భర్తతో గొడవపడి చనిపోయేందుకు విజయవాడ కృష్ణా నదీ బ్యారేజ్‌పై నుండి దూకడానికి ప్రయత్నించిన సమయంలో విధులు ముగించుకుని అటువైపుగా వెళుతున్న మహిళా ట్రాఫిక్ పోలీస్ జి.నవ్య అప్రమత్తమై ఆమె ప్రాణాలను కాపాడి వన్‌టౌన్ పోలీసులకు అప్పగించింది. పోలీసులు సదరు మహిళకు కౌన్సిలింగ్ ఇచ్చిన అనంతరం వారి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించచారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఒక మహిళ ప్రాణాలను కాపాడిన మహిళా కానిస్టేబుల్ జి.నవ్యను పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖరబాబు , ట్రాఫిక్ డిసిపి షిరీన్ బేగం, ప్రత్యేకంగా అభినందించారు.

బజాజ్ ఫిన్సర్వ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఫండ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : బజాజ్ ఫిన్సర్వ్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలో పెట్టుబడులు పెట్టే ఓపెన్-ఎండెడ్ ఈక్విటీ పథకం అయిన బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఫండ్‌ను ప్రారంభించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గణేష్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ ఫండ్ ఆఫర్ నవంబర్ 10న సబ్ స్క్రిప్షన్ కోసం తెరుచుకుంటుందని, నవంబర్ 24వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. బజాజ్ ఫిన్సర్వ్ మ్యూచువల్ ఫండ్స్ మెగాట్రెండ్స్ వ్యూహంపై నిర్మించిన ఈ ఫండ్ బ్యాంకులు, ఎన్బిఎఫ్సిలు, ఇన్సూరర్లు, ఎఎంసిలు, ఇతర క్యాపిటల్ మార్కెట్ భాగస్వాములతో విస్తరించిన వైవిధ్యభరితమైన పోర్ట్ఫోలియో ద్వారా రూపొందించారని అన్నారు .

15న జాబ్ మేళా

ప్రజాశక్తి-మైలవరం : ఈ నెల 15న స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఇళ్ల రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరం, జెకెసి, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డిఆర్డిఏ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళలో శివుణిక్ టెక్, విక్టర్ ఇండియన్ టెక్నికల్ సపోర్ట్, కాంసెంట్రిక్, హెట్రో లాబ్స్, టాటా ఎలక్ట్రానిక్స్ వంటి ప్రముఖ కంపెనీలు వారు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ కంపెనీలలో ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ డిగ్రీ పూర్తి చేసిన 18 నుండి 35 సంవత్సరాల వయస్సులోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్ https://tinyurl.com/jobmela-naipunyamలో తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9966090377, 9959108829,9502757755 సంప్రదించాలన్నారు.